కుల గణన సర్వేకు ఇండ్ల గుర్తింపు ప్రక్రియ షురూ..

నర్సంపేటరూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

నర్సంపేట, నవంబర్ 2: కుల గణన కోసం ఇండ్ల గుర్తింపు ప్రక్రియను అధికారులు శనివారం చేపట్టారు. నర్సంపేట మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ఉన్న ఇండ్లను నమోదు చేసేందుకు మున్సిపల్ అధికారులు పనులు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ యజమానుల పేర్ల జాబితాను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అధికారులు 150 మందికి ఒక జాబితా చొప్పున సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 6 నుంచి చేపట్టనున్న కుల గణనలో 56 రకాల సమాచారం సేకరించనున్నారు. 150 ఇండ్లకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించాలని ఇప్పటికే ఆదేశాలు వచ్చాయి.

ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలి

నర్సంపేటరూరల్: ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఎన్యూమరేటర్లకు శనివారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి 150 నుంచి 175 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ వివరాలు సేకరించాలన్నారు. సర్వేలో అలసత్వం వహించొద్దన్నారు. డేటా ఎంట్రీ కూడా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రామ్మోహన్, ఎంఈవో కొర్ర సారయ్య, మున్సిపల్ అధికారులు సంపత్, నాగరాజు, ఆర్ఐ రజాక్, కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తి తీసుకురావాలి

కాశీబుగ్గ, నవంబర్ 2: రైతులు మార్కెట్‌కు నాణ్యమైన పత్తి తీసుకొన్ని మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి (డీఎంవో) కలకోట సురేఖ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ ద్వారా క్వింటాల్‌కు రూ. 7,521 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పత్తిలో తేమ 8 శాతం మించొద్దని, మంచి, చెడు పత్తిని వేర్వేరుగా తీసుకురావాలని, ఒకేసారి కాకుండా రైతులు మార్కెట్‌కు పత్తిని దశలవారీగా తీసుకురావాలని, పత్తిపై నీరు చల్లొద్దని, చెత్త ఉండొద్దని, అపరికత్వమైన కాయను, కొడి పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తిలో కలుపొద్దని సూచించారు. సూర్యోదయం తర్వాతే చేను నుంచి పత్తిని తీయాలని, ప్లాస్టిక్, గన్నీ సంచుల్లో నిల్వ చేయొద్దని, క్లాత్, జాలీ బ్యాగుల్లోనే పత్తి వేయాలని కోరారు. సేకరించిన పత్తిని వరండాలో గాలి తాకేలా ఆరబెట్టాలన్నారు. మార్కెట్‌కు పరిశుభ్రమైన ట్రాలీలోనే టార్పాలిన్లు కప్పి తరలించాలని కోరారు. అప్పుడే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుందన్నారు.

వైద్య విద్యార్థినికి దొంతి చేయూత

విద్యార్థినితో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ఖానాపురం, నవంబర్ 2: పేద విద్యార్థిని వైద్య విద్యకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేయూనిచ్చారు. మండలంలోని మంగళవారిపేటకు చెందిన భూక్యా సేవిక నీట్‌లో ర్యాంక్ సాధించి కోల్‌కతాలోని ఓ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమె తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి కూలి పనులు చేస్తూ సేవికను చదివిస్తున్నది. ఎంబీబీఎస్‌లో చేర్పించేందుకు తల్లికి ఆర్థిక స్తోమత సరిపోకపోవడంతో శనివారం గ్రామస్తులు సేవికను దొంతి వద్దకు తీసుకెళ్లారు. స్పందించి ఎమ్మెల్యే సేవిక నాలుగేళ్ల వైద్య విద్యకు సరిపోయే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో సేవికతోపాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దొంతికి కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్బర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

ADMISSIONS



★Regular/One Sitting Admissions DMPHA(M), DOM, DMIT, DOA, DDIALY, DANS, GNM, B.Sc Nursing, BPham, B.Sc Agri @ 8500903904, 9493903904, 9515137392.
NTW-000

WANTED

jobs Apply Now!

★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

★Wanted Experienced Staff for Car/Bike Cleaning Services. Contact Immediately Mobile No.: 9347481888.
NTW-000

TO-LET

★Commercial Building 3 Floors + Penthouse for Rent, Beside Akshaya Hotel, Jangaon. Ph: 8099573388.
NT-98831

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565

ఎల్లూర్‌గుట్టకు ఎసరు

▪ ప్రకృతి, సహజ వనరులను కాపాడాలి ▪ తవ్వకాలను ఆపేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి

సంగెం, నవంబర్ 2: ప్రకృతికి రమణీయంగా ఉన్న ఎల్లూర్‌గుట్టను తవ్వేస్తున్నారు. అయితే, ప్రకృతి, సహజ వనరులను కాపాడాలని, గుట్ట నుంచి మట్టిని తరలించొద్దని కోరుతూ శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎల్లూర్‌స్టేషన్, బిక్కోజినాయక్ తండా, నర్సానగర్ గ్రామాల మధ్యలోని ఎల్లూర్‌గుట్ట పచ్చని చెట్లతో ప్రకృతి రమణీయంగా ఉంటుంది. రైల్వేట్రాక్‌కు అతి సమీపంలో ఉన్న ఈ గుట్టను రైలులో వెళ్లే ప్రయాణికులు సైతం ఆస్వాదిస్తుంటారు. ఈ గుట్టపై కోనేరు ఉంది. కాకతీయుల కాలంనాటి ఆనవాళ్లతోపాటు శ్రీలక్ష్మీ నర్సింహస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలు ఉండడంతో భక్తులు గుట్టపైకి వెళ్లి పూజలు చేస్తుంటారు. ఇంత ఘన చరిత్ర ఉన్న గుట్టను మట్టి కోసం తవ్వేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. మైనింగ్ పర్మిషన్ ఉందన్నారు. ఇదిలా ఉంటే.. ఎల్లూర్‌గుట్ట నుంచి మట్టిని తవ్వితే అడ్డుకుంటామని గ్రామస్తులు గుగులోత్ లక్ష్మణ్, గుగులోత్ రమేశ్, బానోత్ సుమన్, జాటోత్ కోటి తెలిపారు.

గుట్టను ఎక్స్‌కవేటర్‌తో తోడుతున్న దృశ్యం

సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి నిర్మల

సకాలంలో మార్కెట్ ఫీజు చెల్లించాలి

కాశీబుగ్గ, నవంబర్ 2: లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల వ్యాపారులు సకాలంలో మార్కెట్ ఫీజు చెల్లించాలని కార్యదర్శి పోలెపాక నిర్మల కోరారు. మార్కెట్ ప్రధాన కార్యాలయంలో శనివారం టమాట, పండ్ల వ్యాపారులతో ఆమె వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెండింగ్ బకాయిలు, అద్దెలు చెల్లించాలని కోరారు.

20 శాతం వరకు తేమ ఉన్న పత్తిని కొనాలి

కాశీబుగ్గ, నవంబర్ 2: సీసీఐ ద్వారా 15 నుంచి 20 శాతం వరకు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు కోరారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌జీతోపాటు సీసీఐ చైర్మన్ లలితకుమార్ గుప్తా, కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎంపీ ఈటెల రాజేందర్, సీసీఐ జీఎం అర్జున్‌దేవాకు ఈ-మెయిల్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. వర్షాలు అధికంగా కురిసినందున తేమ శాతం అధికంగా ఉందన్నారు.

నకిలీ పాస్‌పుస్తకాలపై విచారణ ముమ్మరం

నర్సంపేట, నవంబర్ 2: నకిలీ పోడు పాస్‌పుస్తకాలతో రుణాలు పొందిన వారి జాబితా సిద్ధం అవుతున్నది. కొందరు బ్యాంక్ అధికారుల పాత్ర ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లోని కొందరు నకిలీ పోడు పాస్‌పుస్తకాలను తయారు చేయించుకున్నట్లు సమాచారం. నకిలీ పాస్‌పుస్తకాల వెనుక ఉన్న బ్యాంక్ అధికారులపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. నకిలీ పాస్ పుస్తకాలను తనఖాకు ఒప్పుకున్న బ్యాంకు అధికారులు, రహస్యంగా రైతులతో ఒప్పందం ఎవరు చేసుకుని రుణాలు ఇస్తున్నారనే కోణంలో అటవీ శాఖ అధికారులు విచారణ చేస్తున్నారు. బ్యాంక్, అటవీ శాఖలోని కొందరు వీరికి సహకరించారన్న ప్రచారం జరుగుతుండడంతో ఆ కోణంలోనూ అధికారులు విచారిస్తున్నారు.

'ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి'

ఖిలావరంగల్, నవంబర్ 2: సీపీఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శివనగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ శతజయంతి ఉత్సవాలను గ్రామాలు, పట్టణాలు అనే తేడా నిర్వహించాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రవి, రమేశ్, ఎస్‌కే బాష్మియా, పనాస ప్రసాద్, లక్ష్మణ్, రవీందర్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరికి గాయాలు

వర్ధన్నపేట, నవంబర్ 2: వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం డీసీతండా వద్ద జరిగింది. తండావాసుల కథనం ప్రకారం.. వరంగల్ మండిబజార్‌కు చెందిన మెకానిక్ ఎండీ.హుస్సేన్(45) వరంగల్ నుంచి తొర్రూరుకు వెళ్తున్నాడు. డీసీతండా వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన హుస్సేన్‌ను అంబులెన్స్‌లో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

జూనియర్ కళాశాలలో శ్రమదానం

వర్ధన్నపేట, నవంబర్ 2: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులు శ్రమదానం చేశారు. ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు విద్యార్థులతో కలిసి కళాశాల మైదానం, ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు.

'విద్యారంగ సమస్యలపై చర్యలు చేపట్టాలి'

పర్వతగిరి, నవంబర్ 2: విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ యూనియన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రాపాక రవీందర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యా విధానాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ యూనియన్ వార్షిక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మటన్ షాపు నిర్వాహకుడికి జరిమానా

వరంగల్, నవంబర్ 2 : నిబంధనలకు విరుద్ధంగా డ్రై డే శనివారం రోజు మాంసం విక్రయిస్తున్న మటన్ షాపు నిర్వాహకుడికి బల్దియా అధికారులు జరిమానా విధించారు. శనివారం నర్సంపేట రోడ్డులోని ఏ-1 మటన్ షాపులో మాంసం విక్రయిస్తున్న సమాచారం తెలుసుకున్న బల్దియా అధికారులు తనిఖీ చేసి రూ. 3 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఎంహెచ్‌వో రాజారెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మాంసం విక్రయదారులు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనివాస్, జవాన్లు నాగరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మల పండుగ

చెన్నారావుపేట, నవంబర్ 2: తిమ్మరాయిన్‌పహాడ్‌లో శనివారం ఆత్మల పండుగను ఘనంగా నిర్వహించారు. పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏటా నవంబర్ 2న కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని పునీత రాయప్ప చర్చి ఫాదర్ తుమ్మ యాగారెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు వరంగల్ విద్యార్థులు

పోచమ్మమైదాన్, నవంబర్ 2: సంగారెడ్డి జిల్లాలో ఆదివారం జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ కరాటే పోటీలకు వరంగల్ విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ గడదాసు మణికంత తెలిపారు. గోల్డెన్ ఓక్ పాఠశాల విద్యార్థి నాంపల్లి గీతిక, సాయి 58 కిలోల విభాగంలో, ఏవీవీ పాఠశాల విద్యార్థిని వలభోజు హాసిని 38 కిలోల విభాగంలో ఎంపికైనట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు నవ్యశ్రీ

కరీమాబాద్, నవంబర్ 2: రంగశాయిపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన నవ్యశ్రీ 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని శనివారం పాఠశాలలో అభినందించారు. ఆదివారం నుంచి కామారెడ్డిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందన్నారు.

ఆరు గ్యారెంటీల ఎసరుకే బీసీ గణన

▪ ఆస్తుల వివరాల సేకరణపై అనుమానాలు ▪ సమావేశంలో బీసీ నాయకులు

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సూరయ్య

నెక్కొండ, నవంబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బీసీ కుల గణనపై ప్రజల్లో భయాందోళన నెలకొందని, ఆరు గ్యారెంటీల ఎసరుకే ఈ సర్వే చేపట్టిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, మాజీ ఎంపీపీ జాటోత్ రమేశ్‌నాయక్, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ లావుడ్యా సరోజా హరికిషన్ అన్నారు. నెక్కొండలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను పెంచుతున్నట్లు ప్రభుత్వం నాటకమాడుతోందని విమర్శించారు. కులగణనలో ఆస్తుల వివరాలు సేకరించడం ఏమిటని ప్రశ్నించారు. తెల్ల రేషన్‌కార్డులను ఎత్తివేసి పథకాలకు గండిపెట్టడమే లక్ష్యంగా సర్వే చేపడుతున్నట్లు తెలుస్తున్నదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ కర్పూరపు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సోమయ్య, నాయకులు వీరస్వామి, సురేశ్, సాంబయ్య, వాగ్యానాయక్, లింగ్యా, తోపనపల్లి మాజీ సర్పంచ్ వెంకన్న, మీడియా కన్వీనర్ మాతంగి రాజు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, నవంబర్ 2: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి సూచించారు. మొరిపిరాల, మైలారంలో పత్తి, తిర్మలాయపల్లి, జగన్నాథపల్లి, గట్టికల్, సన్నూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో రాయపర్తి సొసైటీ చైర్మన్ కుందూరు రాంచంద్రారెడ్డి, తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్, ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు, ఏవో గుమ్మడి వీరభద్రం, ఏపీఎం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెల్డింగ్ చేస్తుండగా డీసీఎం దహనం

మంటల్లో కాలిపోతున్న డీసీఎం

గీసుగొండ, నవంబర్ 2: కోనాయిమాకులలోని ఆంజనేయస్వామి టెంపుల్ సమీపంలో డీసీఎం వాహనానికి వెల్డింగ్ చేస్తుండగా నిప్పంటుకొని దహనమైన ఘటన శనివారం జరిగింది. ఎస్సై కుమార్ కథనం ప్రకారం.. అగరవత్తుల తయారీకి వాడే పౌడర్ లోడ్‌తో డీసీఎం వాహనం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి బెంగళూరుకు వెళ్తున్నది. కోనాయిమాకుల వద్ద డీసీఎం టైర్ కట్టలకు వెల్డింగ్ చేయించేందుకు డ్రైవర్ హరిశంకర్ రాజ్పుత్ వెల్డింగ్ షెడ్ వద్ద ఆపి వెల్డింగ్ చేయిస్తున్నాడు. ఈ క్రమంలో బ్యాటరీ ఎర్త్ వైర్ షార్ట్ సర్క్యూట్‌కు గురై నిప్పురవ్వలు ఎగిసిపడి డీసీఎంలో ఉన్న పౌడర్‌పై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడంతో వెల్డింగ్ షాపు నిర్వాహకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ఫైరింజిన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. వెల్డర్ నిర్లక్ష్యంతోనే మంటలు అంటుకున్నాయని డీసీఎం డ్రైవర్ తెలిపాడు.

'నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం'


కేజీబీవీలో మాట్లాడుతున్న చావ రవి

ఖానాపురం/వరంగల్‌చౌరస్తా/గీసుగొండ, నవంబర్ 2: వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా టీఎస్ యూటీఎఫ్ బలపర్చిన అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించుకుందామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి పిలుపునిచ్చారు. నర్సిరెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం ఆయన అశోక్‌నగర్ కేజీబీవీ, సైనిక్‌స్కూల్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రసాదరావు, రవూఫ్, రమేశ్, శ్రీనివాస్, హరిప్రసాద్, మల్సూర్, సీతారాం, నీలాద్రి, చంద్రశేఖర్, రామ్మోహన్‌రావు, గంగయ్య పాల్గొన్నారు. అలాగే, ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలని కోరుతూ చావ రవి వరంగల్ 27వ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు ఏకం కావాల్సిన సమయం వచ్చిందని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాదరావు, కోశాధికారి ఎండీ రవూఫ్, కార్యదర్శి రమేశ్, మండల బాధ్యులు శ్రీనివాస్, చిలువేరు హరిప్రసాద్ పాల్గొన్నారు. అంతేకాకుండా గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన ఓటరు నమోదులో రవి పాల్గొని నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా బాధ్యుడు తాటికాయల కుమార్, కార్యదర్శి సుజన్‌ప్రసాద్, నాయకులు మల్సూర్, సీతారాం, నీలాద్రి పాల్గొన్నారు.

కేవీకేను సందర్శించిన అటారి డైరెక్టర్

పనిముట్లు అందజేస్తున్న అధికారులు

కరీమాబాద్, నవంబర్ 2: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి పదో అటారి డైరెక్టర్ షేక్ మీరా, విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ మహేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకేలో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం షెడ్యూల్ తెగలు, కులాల ప్రణాళికలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లిని కలిసిన యువ నాయకుడు

స్వీట్లు అందజేస్తున్న రత్నాకర్‌రెడ్డి

రాయపర్తి, నవంబర్ 2: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బురహాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు కార్దూరి రత్నాకర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లికి మిఠాయిలు అందించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పోచంపల్లిని కలిసిన మైనాల నరేశ్

పోచంపల్లికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నరేశ్

వరంగల్, నవంబర్ 2: ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు మైనాల నరేశ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని పోచంపల్లి అన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యే వరకూ ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని సూచించారు. కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మైనాల నరేశ్‌ను ఆయన అభినందించారు.

కమలాకర్‌ను పరామర్శిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

గంగుల కమలాకర్‌కు పరామర్శ

నర్సంపేట, నవంబర్ 2: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను పరామర్శించారు. కరీంనగర్‌లో గంగుల కమలాకర్ తల్లి లక్ష్మి ఇటీవల మరణించగా, శనివారం దశదినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది హాజరై మాజీ మంత్రిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు

సమన్వయంతో పని చేయాలి

గిర్మాజీపేట, నవంబర్ 2: వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని డీఎంహెచ్‌వో బీ సాంబశివరావు సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, ప్రోగ్రాం ఆఫీసర్లు, పీహెచ్‌సీ వైద్యాధికారులతో శనివారం సమీక్షించారు. అనంతరం కరీంనగర్‌కు బదిలీపై వెళ్లిన డీఎంహెచ్‌వో వెంకటరమణ, అలాగే, డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేసి ములుగు డీఎంహెచ్‌వోగా బదిలీపై వెళ్లిన డాక్టర్ గోపాల్‌రావును సిబ్బందితో కలిసి డీఎంహెచ్‌వో సాంబశివరావు ఘనంగా సత్కరించారు. అనంతరం సాంబశివరావును అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు, వైద్య సిబ్బంది సత్కరించారు.

నిరసన తెలుపుతున్న రైతులు

పంట నష్టపరిహారం అందించాలి

ఖానాపురం, అక్టోబర్ 2: బయోసీడ్ 504 వరి విత్తనాల వల్ల పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని బుధరావుపేట రైతులు డిమాండ్ చేశారు. శనివారం వారు బుధరావుపేటలో వరి కంకులను చూపుతూ నిరసన తెలిపారు. 70 మంది రైతులు నర్సంపేటలో బయో సీడ్ వారి 504 వరి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసినట్లు తెలిపారు. 80 శాతం పైరు నల్లగింజలతో ఎందుకు పనికిరాకుండా పోయిందని వాపోయారు. కార్యక్రమంలో రైతులు వల్లెపు కుమారస్వామి, గట్ల సుదర్శన్, బాలరాజు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులు విక్రయిస్తే చర్యలు

వర్ధన్నపేట, నవంబర్ 2: ప్రభుత్వ నిషేధిత వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చందర్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిషేధిత వస్తువులు, అసాంఘిక కార్యకలాపాలు, సైబర్ నేరాలపై ప్రజలు, యువతకు అవగాహన కల్పించారు. గుట్కాలు, అంబర్లు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సెంకర్ ఎస్సై రాజు, సిబ్బంది, యువత పాల్గొన్నారు.

ఆడెపు రవీందర్‌కు కీర్తి పురస్కార్ అవార్డు

రవీందర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పోచమ్మమైదాన్, నవంబర్ 2: శ్రీబాలాజీ క్రియేషన్ అధినేత, బ్యాంకు కాలనీకి చెందిన ఆడెపు రవీందర్‌కు సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్ చేతుల మీదుగా కీర్తి పురస్కార్ అవార్డును శనివారం ప్రదానం చేశారు. జేబీ కల్చరల్ ఆర్ట్స్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌కు చెందిన గాయకులు శంకర్, సారంగపాణి జ్ఞాపకార్థం రవీందర్‌కు ఈ అవార్డును అందజేశారు.

స్నేహితుల కుటుంబానికి ఆర్థిక సాయం

పర్వతగిరి, నవంబర్ 2: వడ్లకొండకు చెందిన క్లాస్‌మేట్స్ పోతుగంటి రమేశ్, జ్యోతి తండ్రి వెంకటాచారి ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు శనివారం వారి బాల్యమిత్రులు రూ. 16 వేలు అందించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట మాజీ సర్పంచ్ ఆమడగాని రాజు, జుట్టుకొండ కరుణాకర్, ఆనందరావు, దుర్గయ్య, అనిల్‌రావు, సదానందం, పట్టాపురం రాజు, రవీందర్, రమేశ్, కే రాజు, గారె రవి, పోకల కుమార్, బాల్లె రవి, నాల్లం రాజు, కొంగ రాజు, సుజాత పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతల అవస్థలు

వర్ధన్నపేట శివారులో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

వర్ధన్నపేట/నర్సంపేటరూరల్, నవంబర్ 2: పంటలు చేతికొచ్చే వేళ భారీ వర్షం కురవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. వానకాలం వరికోతలు ప్రారంభమైనా గ్రామాల్లో అనుకున్న స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీనికి తోడు ఆరబెట్టి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని చెప్పడంతో రైతులు గ్రామాల సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో వర్ధన్నపేట, నర్సంపేట మండలాల్లో ధాన్యపు రాశులు, మక్కజొన్న తడిసిపోయాయి. ముఖ్యంగా నర్సంపేట-మల్లంపల్లి ఎన్‌హెచ్-365కి ఇరువైపులా ముత్తోజిపేట, ఆకులతండా, నర్సింగాపురం, ఇటుకాలపల్లిలో ఆరబోసిన మక్కలు తడిసిముద్దయ్యాయి. రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈదురుగాలులతో వరిపంట నేలవాలింది.

నర్సంపేట రూరల్: మాదన్నపేట శివారులో వర్షానికి నేలవాలిన వరి పంట